నేటి దినపత్రిక
18వ వసంతం
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం,28 జనవరి 2025 8 పేజీలు

## పోక్సో కేసులో ముద్దాయికి
# 3ఏళ్ల జైలుశిక్ష,10వేలు జరిమానా

**అగిరిపల్లిమేజర్‌న్యూస్:** కృష్ణాజిల్లా మచిలీపట్నం పోక్సో కోర్టు సెషన్స్ జడ్జి గాజుల వెంకటేశ్వర్లు నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో గల ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 168/2020 యూ /సెక్షన్.376 ఆర్ / డబ్ల్యు 511,323,ఐపీసీ అండ్ సెక్షన్ 18 ఆఫ్ పోక్సో 2012యాక్ట్ కేసులో ఆగిరిపల్లి మండలం,కృష్ణ వరం గ్రామానికి చెందిన యాదల కిషోర్ అనే వ్యక్తిపై నేరం రుజువైనందున ముద్దాయికి 3 సంవత్సరాల జైలు శిక్ష,10వేల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 3 నెలలు జైలు శిక్షను అదనంగా,ఈ కేసులో బాధితురాలకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు.

**నేర సమాచారం –** ఈ కేసులో బాధిత బాలిక ఆ నేర సమయంలో కరోనా లాక్ డౌన్‌లో 10-08-2020 వ తేదీ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నట్లు ఈ కేసులో నేర సమయమునకు ముందర బాధిత బాలిక తన ఇంటి వద్ద దడిపై పాకిన కాకర మొక్క కాయలు

- తరువాయి 2లో..

## రూ.1080 కోట్లతో 21,220 కి.మీ మేర
# గుంతల రహిత రోడ్లు

- ఫిబ్రవరి నాటికి పూర్తిచేయాలనే లక్ష్యం
- నాబార్డు నిధులతో రూ.1149 కోట్ల వ్యయంతో కొత్తరోడ్లు
- రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు శాఖ మంత్రి జనార్ధనరెడ్డి



**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రూ. 1080 కోట్లతో 21,220 కి.మీ మేర పనులు చేపట్టి ఇప్పటికే 12,724 కి.మీ మేర రోడ్లపై గుంతలు పూడ్చినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి. సి. జనార్ధనరెడ్డి వెల్లడించారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక రెవిన్యూ అతిధి గృహంలో ఆయన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని రాష్ట్ర, జిల్లాలో రోడ్ల అభివృద్ధి పనులు ప్రగతిని వివరించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి బి.సి. జనార్ధనరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్ధిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు మెరుగైన రహదారులు అందించాలనే లక్ష్యంతో రూ.1080 కోట్ల నిధులతో రోడ్ల మరమ్మతు పనులు చేపట్టామన్నారు. వీటిలో ఇప్పటికే 65 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. 2014-19 మధ్య రహదారుల కొరకు ఆనాటి టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.11 వేల 468 కోట్లు ఖర్చుచేశామన్నారు. అయితే గత ప్రభుత్వం రూ.16 వేల 852కోట్లు కేటాయించి కేవలం 7వేల 334 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. అందులో మళ్లి తిరిగి రూ. 2,300 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 180 రోజుల్లోనే రూ. 1066 కోట్ల బకాయిలు చెల్లించామన్నారు. మరమ్మతులు చేయలేని స్ధితిలో ఉన్న రోడ్ల స్ధానంలో ముఖ్యమంత్రి సూచన మేరకు రూ.1149 కోట్ల వ్యయంతో కొత్త రోడ్లను నాబార్డు నిధులతో చేపట్టనున్నట్లు మంత్రి జనార్ధనరెడ్డి వెల్లడించారు. రోడ్లపై ముళ్లకంపలను తొలగించి రూ.33 కోట్ల వ్యయంతో 23 వేల 521 కి.మీ మేర జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, వంటి ప్రక్క రాష్ట్రాలు సైతం ఆంధ్రప్రదేశ్ రోడ్లను స్టడీచేసే పరిస్ధితి ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం 12 వేల 653 రాష్ట్ర హైవేలు ఉండగా వీటిలో 10 వేల 200 కి.మీ మేర పిపిపి పద్దతిలో నిర్మాణం చేపట్టే ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 2019 ఫిబ్రవరిలో ఎన్ డి బి ద్వారా జిల్లా, మండల కేంద్రాల రోడ్ల అనుసంధానం కోసం ఫేజ్-1 కింద రూ. 3014 కోట్లతో చేపట్టిన 1244 కి.మీ రోడ్లు ,2 బ్రిడ్జిలనిర్మాణం పనుల్లో 26 శాతం పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లాలో రూ.98 కోట్లతో 174 రోడ్ల మరమ్మతు పనులను

- తరువాయి 2లో..



## అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరూ
# భాగస్వాములు కావాలి

- రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు



**కాళ్ళ,మేజర్‌న్యూస్:** కాళ్ల మండలం కాళ్ళకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కాళ్ల పోలీస్ స్టేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సోమవారం రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘు రామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ సి.నాగరాణి,జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా

- తరువాయి 2లో..



## వెంకటేశ్వర స్వామిని
# దర్శించుకున్న
# విప్ నాయకర్

**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ కూటమి నాయకులతో కలిసి తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామీ వారిని రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ దర్శించుకున్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్ర మంలో ఉంగుటూరు ఎమ్మెల్యేధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీల పర్సన్ ఇన్-చార్జిల నియామకంపై కూటమిలో రచ్చ

## - టీడీపీ ఆగ్రహం - పార్టీ అధిష్టానాని లేఖ

**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లోని రైతులపై పట్టుసాధించే సహకార సంఘాలకు పాలకవర్గాల స్ధానంలో పర్సన్ ఇన్-చార్జీల నియామకాన్ని చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.కొయ్యలగూడెం మండలంలో మొత్తం ఏడు సొసైటీలు ఉండగా,వాటిలో మూడు సంఘాలు టీడీపీ పార్టీ వారికి, మరో మూడు సంఘాలను జనసేన, మిగిలిన ఒక సొసైటీని బీజేపికి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు జనసేన నాయకులు చెబుతున్నారు.అయితే ఈ విషయమై మాకు ఏమీ తెలియదని, తమ పార్టీ నాయకుని ప్రమేయం లేకుండానే నియోజకవర్గ జనసేన పార్టీ అగ్రనాయకత్వమే ఈ నిర్ణయాలు తీసుకుని, తమకు చెప్పిందని టీడీపీ నాయకులు గుర్రుగా ఉన్నారు. జనసేన స్ధానిక అగ్రనాయకుల వైఖరి అలాగే పర్సన్ ఇన్ చార్జిల నియామకానికి అభ్యర్థుల ఎంపిక తీరు పట్ల రగిలిపోతున్న టీడీపీ నాయకులు, ఇక్కడి పరిణామాలపై తమ పార్టీ అధిష్టానానికి సవివరంగా లేఖ వ్రాసినట్లు ఆ పార్టీ ముఖ్యనాయకులు సోమవారం సాయంత్రం 'మేజర్ న్యూస్'తో మాట్లాడుతూ చెప్పారు.తెలుగుదేశం పార్టీకి కేటాయించినట్లుగా చెబుతున్న సొసైటీల పర్సన్ ఇన్-చార్జిలకు ఎంపిక చేసే నాయకుల పేర్లు కూడా



జనసేన నాయకులే సూచించడం తమకు ఆశ్చర్యం కలిగిస్తుందని, టీడీపీకి చెందిన ఓ అగ్రనాయకుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. మండలంలో కీలకమైన కొయ్యలగూడెం, బయ్యనగూడెం, గవరవరం సహకార సంఘాలను తెలుగుదేశం పార్టీకి దక్కకుండా జనసేన నాయకులు

- తరువాయి 2లో..

# పోక్సో కేసులో ముద్దాయికి 3ఏళ్ల జైలుశిక్ష,10వేలు జరిమానా

**మొదటిపేజి తరువాయి**

కోసుకునుచుండగా అదే సమయంలో సదరుపై ముద్దాయి మోటార్ సైకిల్‌పై వచ్చి ఏదో మాటగా పిలిచినట్లు ,అమాంతంగా, బలవంతంగా తన భుజంపై వేసుకుని సమీపంలో ఉన్న మామిడి తోటలోకి తీసుకుని పోయినట్లు, బాలికపై బలత్కార ప్రయత్నం చేస్తున్నసమయంలో బాలిక కేకలు వేసింది. అదే సమయంలో ప్రత్యక్షంగా చూసిన సాక్షులు హెచ్చరించినట్లు ఆ విషయం ఆమె తల్లిదండ్రులకు కూడా తెలిసినట్లు వారు కూడా వచ్చేలోపుగా ముద్దాయి మోటార్ సైకిల్ వదిలి అచట నుండి పారిపోయినట్లు దానిపై బాధిత బాలిక యొక్క తల్లి ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇచ్చింది. ఆసమయంలో అప్పటి స్టేషన్ అధికారి హెచ్‌సి 181 జి వి.రమణ ఆ రిపోర్టు పై వారు ఉన్నతాధికారులకు ఆ విషయం తెలుపగా, వారి ఆదేశాలతో కేసు నమోదు చేసినటు,కేసు దర్యాప్తు చేసినట్లు ప్రత్యక్ష పరోక్ష సాక్షులైన 9మందిని విచారించి ఆ తదనంతరం అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పరిమి కిషోర్ తదనంతరం దర్యాప్తులో బాధ్యతలు తీసుకుని, కేసులో పూర్వపరాలు పరిశీలించారు. అనంతరం ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేసి,కేసులో దర్యాప్తు పూర్తి చేసిన తర్వాత కోర్టులో ఛార్జ్ షీట్ ఫైలు చేశారు. ఈ కేసులో వాదోప వాదనలను,ఫిర్యాదు తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నటువంటి ముంజులూరి వేంకట మహేష్,అప్పటి ఆగిరిపల్లి ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది సహాయంతో 8మంది సాక్షులను కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. కోర్టులో వారిచ్చిన సాక్ష్యం నేపథ్యంలో ప్రత్యేక పీపీ చిన్నారావు వాదనలు వినిపించారు. అనంతరం సోమవారం ముద్దాయికి సెషన్స్ జడ్జి శిక్ష విధించారు. ఈ కేసులో ఆగిరిపల్లి అప్పటి ఎస్సై పరిమి కిషోర్,హెడ్ కానిస్టేబుల్ "జి .వి రమణ, ఇప్పటి ఎస్‌ఐ కె శుభ శేఖర్, పిఎస్ సిబ్బంది,పోక్సో కోర్ట్ సిఎంసీ హెడ్ కానిస్టేబుల్ ముక్కుశ్రీనివాసరావు, ఏలూరు జిల్లా,కోర్టు మోనిటరింగ్ సెల్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావునూజివీడు ఎస్ డీపీవో కె వి.వి.ఎన్.వి ప్రసాదు, నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కెరామ కృష్ణ ఆధ్వర్యంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ముద్దాయికి శిక్ష పడిన సందర్భంగా దానిపై ఏలూరు జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ సిబ్బందిని అభినందించారు.

# సొసైటీల పర్సన్ ఇన్-చార్జిల నియామకంపై కూటమిలో రచ్చ


**మొదటిపేజి తరువాయి**

కుతంత్రాలు పన్నుతున్నారని టీడీపీ నాయకులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. బయ్యనగూడెం, రామానుజపురం, కొయ్యలగూడెం సొసైటీలను జనసేన తీసుకుందని, అలాగే దిప్పకాయలపాడు, కన్నాపురం, సరిపల్లి సహకార సంఘాలను తెలుగుదేశం పార్టీకి కేటాయించినట్లు వారు ప్రకటించారని,గవరవరం సొసైటీని బీజేపికి కట్టబెడుతున్నట్లు వారు గొప్పలు చెప్పుకుంటున్నారని టీడీపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గరవరం సొసైటీని తాము ఎప్పటికీ వదులుకోలేమని ఆ సొసైటీ పరిధిలోని గవరవరం, పొంగుటూరు,కన్నాయగూడెం,యర్రంపేట తదితర గ్రామాల సొసైటీ సభ్యులుగా ఉన్న రైతులు చెబుతున్నారు. యర్రంపేటకు చెందిన దుగ్గిరాల సుభాష్ చంద్రబోస్ అనే యువ రైతును టీడీపీ తరపున నిర్ణయించాలని రైతులు,టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు.

అయితే ఈ సొసైటీని జనసేన నాయకత్వం బీజీపీకి కేటాయించడంతో అక్కడ అభ్యర్థిగా ఎంపిక చేయాలనుకున్న ఎస్.ఆర్.ఆర్.సుభద్రాదేవి వర్గీయులు ఎటూ పాలుపోలేని స్థితిలో ఉన్నారు. బయ్యనగూడెం సొసైటీకి మాజీ సొసైటీ అధ్యక్షుడు మద్దు బాల నాగేశ్వరరావు,రామానుజపురం సొసైటీకి అప్పన ప్రసాద్, కొయ్యలగూడెం సొసైటీకి ఒక పత్రికా విలేఖరి మన్నీడి సాయిబాబాలను ఆయా సొసైటీల పర్సన్ ఇన్-చార్జిగా నియమించడానికి జనసేన నియోజకవర్గ నాయకత్వం దాదాపు ఖరారు చేసినట్లు కీలక నేతలు చెబుతున్నారు. టీడీపీకి కేటాయించినట్లుగా చెబుతున్న దిప్పకాయలపాడు సొసైటీకి యనమదల ప్రసాద్ సతీమణి పేరును,కన్నాపురం సొసైటీకి మేడిన రత్నాజీ పేరును, సరిపల్లి సొసైటీకి మద్దు ప్రసాద్ పేరును సిఫార్సు చేస్తున్నట్లు చెబుతున్నారు. కొయ్యలగూడెం మండలానికి చెందిన రాజవరం, గంగవరం, మంగపతిదేవిపాలెం గ్రామాలకు చెందిన రైతులు సభ్యులుగా ఉన్న జంగారెడ్డిగూడెం మండలంలోని తిరుమలాపురం సొసైటీకి రాజవరం గ్రామానికి చెందిన బల్లే రామచంద్రప్రసాద్ (పండు) పేరును దాదాపు ఖరారు చేస్తున్నట్లు జనసేన వర్గీయులు చెబుతున్నారు. ఆయన కూడా జనసేన పార్టీ వ్యక్తి కావటం విశేషం. కొయ్యలగూడెం సొసైటీకి పర్సన్ ఇన్-చార్జి పదవిని ఆశించిన జనసేన నాయకుడు దుగ్గిన శ్రీనివాస్ ఈ ఎంపికలపై అసంతృప్తితో ఉన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి ఈ విషయమై మాట్లాడతానని, సరైన నిర్ణయం రాకపోతే తదుపరి కార్యచరణ నిర్ణయిస్తామని ఒక నాయకుడు మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ అన్నారు. అయితే టీడీపీ, జనసేన నాయకుల పట్టుదలల మధ్య బీజేపికి ఏ సొసైటీ కేటాయిస్తారనేది ఆ పార్టీ నాయకులు తర్జనభర్జన పడుతున్నారు.

## కొళాయి చెరువులో గల్లంతైన యువకుడు, ప్రాణం తీసిన గూటిబెళ్ళ





పాలకొల్లు,మేజర్ న్యూస్: స్థానిక మున్సిపల్ పంపుల చెరువు సమీపంలో ముగ్గురు యువకులు గూటి బిళ్ళ ఆడుకుంటున్న సమయంలో ఒక యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. చెరువులో బిళ్ళ పడడంతో ముగ్గురు స్నేహితులు కలిసి చెరువులోకి దూకారు, కొద్దిగా ఈత రావడంతో ఇద్దరు ఒడ్డుకొచ్చారు, మతికాని హరికృష్ణ 17 సంవత్సరాలు ఈదుకుంటూ చెరువులో మునిగిపోయాడాని వారి స్నేహితులు తెలిపారు, మున్సిపల్ కమిషనర్ పార్ధ సారధి, తహసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, నర్సాపురం డిఎస్పి శ్రీ వేద, పోలీసులు నరసాపురం కు చెందిన గ జితగాళ్లు తో వెతికిస్తున్నారు, తండ్రి తల్లి కూలి పని చేసుకునే బ్రతికే సామాన్య కుటుంబం, ఒక కుమారుడు ఒక కుమార్తె సంతానం. కుమారుడు ఈ విధంగా గల్లంతవడంపై తల్లిదండ్రులు భోరున వినిపిస్తున్నారు.

# బాధిత విద్యార్థికి ఎస్‌టియు విరాళం



పాలకొల్లు,మేజర్‌న్యూస్: స్థానిక జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న కుషాల్ ఈశ్వర్,భోగి రోజున అగ్ని ప్రమాదానికి గురై, భీమవరం లోని సాయి సుజిత హాస్పిటల్ లో, వైద్య చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. విద్యార్థికి జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న యలమంచిలి ఎస్టియు శాఖ తన మానవత్వాన్ని చాటుకుంది. యలమంచిలి ఎస్.టి.యు మండల శాఖ అధ్యక్షులు బాలాజీ వర్మ, సుబ్బారావు. పుల్లేటికుర్తి శ్రీనివాస్ తదితరులు రూ.11 వేల రూపాయలను విద్యార్థికి ఎస్టీయూ తరపున సహాయంగా అందజేశారు. మానవత్వం చాటుకున్నారు.

ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భవాని ప్రసాద్ రాయపూడి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల ఎస్.టి.యు చేస్తున్న కృషి మరువ లేదని కొనియాడారు. సామాజిక సమస్యలపై ఎస్.టి.యు నేతలు చేస్తున్న పోరాటాలు ఆదర్శనీయమన్నారు. ఆపద సమయంలో విద్యార్థుల సహాయార్థం విరాళాలను అందిస్తూ చేయూతనిస్తున్న ఎస్.టి.యు కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేగొండి సత్యనారాయణ, ఆర్.బాలాజీ వర్మ,పి.నాగరాజు,పి.శ్రీనివాస్ వి.గోపి, ఏ.దేవేంద్రుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రూ.1080 కోట్లతో 21,220 కి.మీ మేర గుంతల రహిత రోడ్లు

**మొదటిపేజి తరువాయి**

చేపట్టడం జరిగిందన్నారు. ఇవి కాక వరదల్లో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో పెదవాగు ప్రాజెక్ట్ నుండి వరద నీటి మూలంగా పోయిన రహదారులు మరమ్మతులకు నూజివీడులో పెద్దచెరువు గండి వలన పాడైన రహదారి మరమ్మతులకు రూ.4 కోట్లు మంజూరు చేశామన్నారు.ప్రధాన రహదార్ల మరమ్మతుల కింద ఏలూరు-మేడిశెట్టివారిపాలెం, సిద్ధాంతం-పెదఎడ్లగాడి, భీమవరం-గుడివాడ మూడు ప్రధాన రహదారి పనులు జరుగుచున్నాయన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూ.15 కోట్లతో ఏలూరు శనివారపుపేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు రూపొందించి ఆమోదం పొందే దిశలో ఉన్నాయన్నారు. నూజివీడు బైపాస్ కొరకు భూసేకరణ జరుగుచున్నదని, బైపాస్ నిర్మాణం కొరకు రూ. 25 కోట్లు మంజూరు చేశామన్నారు.రాష్ట్రం, జిల్లాలో చేపట్టిన గుంతల రహిత రహదారుల నిర్మాణాలను ఫిబ్రవరి నాటికి పూర్తిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు,ఆర్ అండ్ బి ఎస్‌ఇ జి. జాన్ మోషే ,ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, తహశీల్దారు జి.వి. శేషగిరి తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా అందరూ భాగస్వాములు కావాలి

**మొదటిపేజి తరువాయి**

పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉండి నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్ల అభివృద్ధికి, మౌలిక వసతులు ఏర్పాటుకు విశేష కృషిచేస్తున్న శాసనసభ ఉప సభాపతి,ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు రఘురామకృష్ణ రాజుకు జిల్లా పోలీసు శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా రఘు రామ కృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధిలో పార్టీల కతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని కోరారు. నియోజక వర్గ అభివృద్ధి పనులకు అవరోధంగా ఉన్న ఆక్రమణల తొలగింపుతో ప్రస్తుతం కొంతమంది ఇబ్బందిపడిన రానున్న కాలంలో నియోజకవర్గ అభివృద్ధిని ప్రశంసించడంలోవారే ముందుంటారన్నారు.ఎవరిని నష్టపరచాలనేది మా ఉద్దేశం కాదని నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా నిలిపేలా అభివృద్ధి చేయడమే లక్ష్యం అన్నారు. పోలీసు వ్యవస్థ ప్రజలకు భరోసాగా పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖకు అన్ని విధాలుగా తోడ్పాటున అందిస్తున్న శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణ రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నూతన భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధుల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని అతి స్వల్ప కాలంలో భవన నిర్మాణం పూర్తి కావడానికి సహకరించిన జిల్లా కలెక్టర్ సి.నాగరాణి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, భీమవరం సబ్ డివిజన్ డిఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.జగదీశ్వర్ రావు, కాళ్ళ ఎస్సై ఎన్. శ్రీనివాస రావు, గ్రామ సర్పంచ్ సాదు శ్రీదేవి, ఎంపీపీ పెనుమత్స శిరీష, తహసిల్దార్, ఎంపీడీవో, ఎంపీటీసీ, జడ్పిటిసి, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్ఆర్ ఫండ్స్ అందజేయడం ద్వారా భాగస్వాములు కావాలి



భీమవరం,మేజర్‌న్యూస్: జిల్లా అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు సిఎస్ఆర్ ఫండ్స్ అందజేయడం ద్వారా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఉండి మండలం వేంద్ర గ్రామం వెల్కమ్ ఫిషరీస్ లిమిటెడ్ అధినేత కె.సౌదాలతీఫా కలిసి సిఎస్ఆర్ ఫండ్స్ క్రింద రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అభివృద్ధి అంతా ప్రభుత్వ వ్యయంతోనే చేపట్టాలంటే సాధ్యం కాదని, వివిధ వర్గాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ నిబంధనల మేరకు సిఎస్ఆర్ ఫండ్స్ రెండు శాతం నిధులను జిల్లా యంత్రాంగానికి అందజేయాలన్నారు. జిల్లా కలెక్టర్‌కు చెక్కును అందజేసిన సందర్భంలో వెల్కమ్ ఫిషరీస్ లిమిటెడ్ అధినేత కె.సౌదాలతీఫా, వారి తండ్రి కె.ఆనంద్ వున్నారు.

# కేసుల త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వమే మార్గం






ఏలూరు,మేజర్‌న్యూస్: కేసుల త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి( ఎఫ్.ఎ.సి) ఎం.సునీల్ కుమార్ తెలియజేశారు. సోమవారం ఏలూరు కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ భవనంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రిటైర్డ్ న్యాయమూర్తులకు,ఎంపికచేసిన న్యాయవాదులకు,సోషల్ వర్కర్లకు 40 గంటల (5 రోజుల) శిక్షణా తరగతులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ప్రధాన ,జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్.ఎ.సి) ఎం. సునీల్ కుమార్ ప్రారంభించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రతిపాదించిన రిసోర్స్ పర్సన్స్‌లతో న్యాయవాదులకు శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నారని తెలియజేశారు. రాజీకి అవకాశమున్న కేసులలో కక్షిదారులను శాస్త్రీయంగా కౌన్సిలింగ్ నిర్వహించడం వల్ల కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్నుకోవడం హర్షించదగ్గ విషయమని, కావున న్యాయవాదుల అవకాశాన్ని ఉపయోగించుకుని కక్షిదారులకు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు.

కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి,ఫోక్సో స్పెషల్ కోర్ట్ జడ్జి ఎస్.ఉమా సునంద, పర్మినెంట్ లోక్ ఆదాలత్ చైర్పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్,ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం,జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రిసోర్స్ పర్సన్స్ పుష్ప గుప్తా, దీపక్ డింగరా, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు 'పెరికే'కి ప్రశంసా పత్రం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పెరికే వర ప్రసాదరావు రావుకి జిల్లా కలెక్టర్ చే సత్కారం ప్రశంసా పత్రం లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తన సేవలను గుర్తించి ప్రశంసా పత్రం అందజేయడం మరింత బాధ్యత పెంచిందని తెలిపారు. కరోనా సమాయంలో,విజయవాడ వరద బాధితులకు చేసిన సేవా కార్యక్రమాలు నిమిత్తం గణతంత్ర వేడుకలు సందర్భంగా బెస్ట్ సోషల్ వర్కర్ అవార్డు రావడం ఆనందదాయకంగా ఉందని పెరికె వర ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ,జిల్లా ఎస్పీ నుండి అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

## కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి



ఏలూరు,మేజర్ న్యూస్ : ఉపాధి లేక పొట్ట చేత్తో పట్టుకొని వలసలు వెళుతున్న గ్రామీణ పేదలకు వ్యవసాయ కార్మికులకు తక్షణమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ ను కోరారు. సోమవారం బికేఎంయు నాయకులు కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి ఉపాధి హామీ పనులు గ్రామీణ పేదలకు కల్పించాలని విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 పని దినాలు కల్పించి రోజు కూలి 700 రూపాయలు ఇవ్వాలని కోరారు. మెటీరియల్ కాంపోనెంట్ ను ప్రభుత్వమే భరించి మొత్తం ఉపాధి హామీ నిధులను కూలీలకే ఖర్చు చేయాలని ఆయన కోరారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో బి కే యం యు జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాలయేసు తదితరులు ఉన్నారు.

# పశువులకు అందాల పోటీలు నిర్వహించడం అభినందనియం



భీమడోలు,మేజర్‌న్యూస్: పాడి రైతులను ప్రోత్సహించేందుకు, ఆదుకునేందుకు పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడు, పశువులకు గుర్తింపు తెచ్చేందుకు అందాల పోటీలను నిర్వహించటం అభినందనీయమని,పూళ్ళ గ్రామ సర్పంచ్ దాయం సుజాత, మాజీ ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి వెంకన్న అన్నారు. పశు సంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పూళ్ళ పశు వైద్యులు డాక్టర్ మున్నంగి హరికృష్ణ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స శిబిరం, లేగ దూడలకు అందాల పోటీలను పూళ్ళ గ్రామపంచాయతీ పరిధిలోని ఎం ఎం పురం ఆవాస ప్రాంతంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు పశువైద్యశాలకు చెందిన సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్,,పూళ్ళ పశు వైద్యులు డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో పశువుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు.

శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ తరపున పాడి రైతులకు పశువుల మందులు , ఇతరాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన లేగ దూడల అందాల పోటీలకు పరిశీలకులు, ముఖ్యఅతిథిగా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ,పెంటపాడు సిఈఓ. డాక్టర్ జేసుదాసు హాజరయ్యారు. పోటీలకు ఒకటి నుంచి నాలుగు నెలల వయసు గల 54 దూడలు హాజరయ్యాయి. శరీర సౌష్టవం, జాతీయ లక్షణాలు ఆధారంగా ఉత్తమ దూడలను ఎంపిక చేశారు. దీనిలో భాగంగా ప్రథమ బహుమతిని గురజాల ఆంజనేయులు, ద్వితీయ బహుమతిని కె.సెల్వరాజు, తృతీయ బహుమతిని రేగడపల్లి మల్లేశ్వరరావు లకు చెందిన దూడలు గెలుచుకున్నాయి. నిర్వాహకులు వీటికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వడ్డి సత్తులు , గోపాల మిత్రలు పాల్గొన్నారు.

## బాలోత్సవంలో అన్నేవారిగూడెం విద్యార్థులు ప్రతిభ



**భీమడోలు,మేజర్ న్యూస్:** హేలాపురి బాలోత్సవంలో పాల్గొన్న అన్నేవారిగూడెం ఎంపిపి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచారని ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 45 అంశాలలో పాల్గొన్నారన్నారు. వీరిలో అన్నెం నాగ సుబ్రహ్మణ్యం అనే విద్యార్థి గుర్రం జాషువా పద్య పఠన పోటీలలో ప్రథమ స్థానం దక్కించుకున్నారని తెలిపారు. ఇతనితో పాటు కోలాటం, మట్టితో బొమ్మలు తయారీ, మెమరీ టెస్ట్, చిత్రలేఖనం, ఇంగ్లీష్ రైమ్స్ పఠనం, ఇతర అంశాలలో నిర్వహించిన పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేశారని తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాల ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థులను సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పి శ్రీనివాసరావు, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఉత్తమ సేవలకు అవార్డులు పొందిన అధికారులు





కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్ : కొయ్యలగూడెం మండలంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకువారువిధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరు నుండి అవార్డులు అందుకున్నారు. కొయ్యలగూడెం పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.సీతయ్య, స్థానిక తాహశీల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇనస్పెక్టర్ మణిదీప్తిక, మండల గృహనిర్మాణ శాఖ ఏ.ఈ. కె.సతీష్, దిప్పకాయలపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ షేక్ సలీం, స్థానిక పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ బి.మోహన కృష్ణారావు, బయ్యనగూడెం వీ.ఆర్.ఓ.,వి.రత్నకుమార్ తదితరులు అవార్డులు స్వీకరించిన వారిలో ఉన్నారు.అవార్డు గ్రహీతలకు సత్కారం. ఉత్తమ అధికారులుగా జిల్లా కలెక్టరు నుండి ప్రసంసాపత్రాలు స్వీకరించిన పంచాయతీ రాజ్ డీవైఈఈ ఎన్.సీతయ్యను, తాహశీల్దార్ కార్యాలయం ఆర్.ఐ. మణిదీప్తికను కొయ్యలగూడెం జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మి నేతృత్వంలో నాయకులు సోమవారం సాయంత్రం సన్మానించారు. పంచాయతీరాజ్ కార్యాలయంలోసీతయ్యను, తాహశీల్దార్ కార్యాలయంలో ఆర్.ఐ. మణిదీప్తికను వారు సత్కరించారు. ఇదే కార్యక్రమంలో జిల్లాలో ఉత్తమ ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నుండి అవార్డు అందుకున్న మండల తాహశీల్దార్ కె.చెల్లన్నదొరనుకూడా తాహశీల్దార్ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు,నాయకులు సోమవారం సాయంత్రం దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు, మెమోంటాలతో ఘనంగా సత్కరించారు..

# పెదపాడు మండలంలో రోడ్ల పనులను పరిశీలించిన మంత్రి జనార్ధన్ రెడ్డి





**పెదపాడు,మేజర్ న్యూస్ :** ఏలూరు - పెరికీడు మధ్య జరుగుతున్న ఎన్ డిబి రోడ్ల పనులను సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి పరిశీలించారు. ఏలూరు జిల్లాకు విచ్చేసిన మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఆర్టీఓ అచ్యుత అంబరీష్ ఘన స్వాగతం పలికారు. పెదపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యేతో కలిసి రాష్ట్ర మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి కలిసి పర్యటించారు. అనంతరం ఎన్ డిబి రోడ్ల పనులు జరుగుతున్న తీరుపై అధికారులు, కాంట్రాక్టర్ ను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు రోడ్ల నిర్మాణంపై మంత్రి పలు సూచనలు చేశారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపుల ప్రక్రియ వేగవంతంగా చేస్తోన్న నేపథ్యంలో. ఎన్ డిబి రోడ్లను సాధ్యమైనంతగా త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఎన్‌డిబి కింద రూ. 111.23కోట్లతో నాలుగు పనులు మంజూరయ్యా యని మంత్రి చెప్పారు. వాటిలో ఏలూరు-పెరికీడు, ఏలూరు-కైకలూరు, ఏలూరు-జంగారెడ్డి గూడెం,దెందులూరు-పంగిడిగూడెం రహదారులు ఉన్నాయన్నారు. ఈ రహదారుల్లో ఉన్న5.50మీ నుండి 7మీటర్లకు వెడల్పు చేసి పటిష్టచేసే పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో ఏలూరు - కైకలూరు రహదారి పనులు పూర్తికాగా మిగిలిన మూడు పనులు జరుగుచున్నాయన్నారు. వీరి వెంట ఆర్అండ్‌బి ఎస్ఈ జి.జాన్ మోషే తదితరులున్నారు.

# 1 నుండి నెల్లూరులో సిపిఎం రాష్ట్ర మహాసభలు

**- 30న పోలవరం నిర్వాసితుల సమస్యలపై ప్రచార జాత**




**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఫిబ్రవరి1 నుండి 3వరకు సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు నెల్లూరు నగరంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి చెప్పారు. సోమవారం ఏలూరు పవర్ పేట లోని ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆ పార్టీ జిల్లా నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభల ముగింపుగా ఫిబ్రవరి 3వతేదీ భారీ బహిరంగ సభ జరుగు తుందని చెప్పారు. ఈ రాష్ట్ర మహాసభల సందర్భంగా రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రచారజాతాలు జరుగుతున్నాయని, అందులో భాగంగా పోలవరం నిర్వాసితుల సమస్యలపై జరుగుతున్న ప్రచార జాత జిల్లాలో ఈనెల30వ తేదీన పర్యటిస్తుందని, ఆజాత ఒకటవ తేదీకి నెల్లూరు చేరుకుంటుందని వివరించారు. రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేయడమే కాకుండా ప్రజాఉద్యమాల నిర్వహణకు దిశా దశ రూపొందించడం జరుగుతుందన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు పూర్తి పునరావాసం, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ పోరాడుతోందని చెప్పారు. సిపిఎం రాష్ట్ర 25వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఆర్.లింగరాజు,కె.శ్రీనివాస్,పి.రామకృష్ణ పాల్గొన్నారు.

# డాక్టర్ మురళిని పరామర్శించిన మాజీ మంత్రి కొత్తపల్లి



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** ప్రముఖ వైద్యులు, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ బల్ల మురళిని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పరామర్శించారు. మురళి తండ్రి వెంకటరమణ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. సోమవారం సుబ్బారాయుడు ఆయన నివాసానికి వెళ్లి వెంకటరమణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు జనసేన నాయకులు ఉన్నారు.

# యువగళంతో ప్రజల్లో చైతన్యం కలిగించిన నారా లోకేష్

**- ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్**



**చింతలపూడి,మేజర్‌న్యూస్:** ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర మొదలు పెట్టి రెండు సంవత్సరాలైన సందర్భంగా చింతలపూడిలో గురుబట్లగూడెం సెంటర్లో బోసు బొమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం ఎమ్మెల్యే రోషన్ కూటమి నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి అందరికీ పంచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ మీడియాతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్, అప్పటి వైసిపి ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజల కష్టాలు,బాధలు తెలుసుకునేందుకు ప్రజల వద్దకు వెళ్లాలని ఉద్దేశంతో యువగళం పేరుతో రాష్ట్రమంతా అన్ని జిల్లాలు పట్టణాలు గ్రామాలు తిరుగుతూ ప్రజల కష్టాలు తెలుసుకొని,అప్పటి వైసిపి ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనను ప్రజలకు వివరిస్తూ ప్రజలలో చైతన్యం తీసుకువచ్చారని,ఆ చైతన్యమే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయదుంధిభి మోగించటం కారణమైందని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు రాష్ట్రం అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఇటీవల కాలంలో దావోస్‌లో పర్యటించి ఇంటర్నేషనల్ ఎకనామిక్ ఫోరంలో ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులే లక్ష్యంగా అక్కడ పెట్టుబడుదారులతో మాట్లాడి మన రాష్ట్రానికి అత్యధికంగా పెట్టుబడులు తీసుకువచ్చే విధంగా వారిని ఒప్పించి, వారితో పాటు మంత్రి నారా లోకేష్ కూడా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రోషన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి, పేద ప్రజలకు వరం

**- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు**



**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు అనారోగ్యంతో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కుల పంపిణీ కార్యక్రమం మండలంలోని మారంపల్లి గ్రామంలోని మండల పార్టీ అధ్యక్షులు లంక సత్యనారాయణ స్వగృహం నందు స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పోలిన శ్రీను,మాజీ జడ్పిటిసి సభ్యులు దేవరపల్లి వీరాస్వామి చౌదరి,క్లస్టర్ ఇంచార్జ్ రేగంటి రాంబాబు,గ్రామ కమిటీ అధ్యక్షులు ముత్తింటి సత్యనారాయణ,మండల తెలుగు యువత అధ్యక్షులు పసుపులేటి వంశీ,నాదెళ్ల వెంకటేశ్వరరావు, పాతూరి సహృదయ,తదితరులు పాల్గొన్నారు.

# 29న రాజమండ్రిలో మాజీ సైనికుల అవగాహన

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈ నెల 29 వ తేదీ రాజమండ్రి రివర్ బే హెటల్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలవరకు మాజీ సైనికుల కొరకు అవగాహనా సదస్సు ఉమ్మడి పశ్చిమ గోదావరి,ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సైనిక సంక్షేమ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సోమవారం సైనిక సంక్షేమ అధికారి కె.వి.సాయి ప్రసాద్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సులో స్పర్ఫ్ ,పెన్షన్ ,రికార్డ్ అప్డేట్ వంటి సమస్యలు గల ఉమ్మడి (పశ్చిమ గోదావరి పరిధిలో ఏలూరు,పశ్చిమ గోదావరి జిల్లాల )ఉమ్మడి తూర్పు గోదావరి పరిధిలో (డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు) చెందిన మాజీసైనికులు ఈ అవకా శమును సద్వినియోగము చేసుకొనవచ్చున్నారు. మరిన్ని వివరము లకు మీకు దగ్గరలో గల మాజీ సైనిక సంక్షేమ సంఘ ప్రతినిధుల నుగాని లేదా జిల్లా సైనిక సంక్షేమ అధికారిని (8688817953) వాట్సప్ నంబరులో గాని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# అధ్యాపకులకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు



**కైకలూరు,మేజర్‌న్యూస్ :** 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఆర్ జల బాబుకు జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి జిల్లా స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును ఏలూరు జిల్లా కేంద్రంలోని పర్యాడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. అదేవిధంగా కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ ఎం హరి హరిప్రసాద్ కు జిల్లాస్థాయిలో ఎన్ ఎస్ ఎస్ అడ్వైజర్ విజయవాడ పురస్కారాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మి అందజేశారు. కార్యక్రమాలైన దసరా మహోత్సవాలు విజయవాడ వరద బాధితులకు సహాయం అందజేయడం వంటి కార్యక్రమాలకు ఎన్ఎస్ఎస్ వాలంటరీలకు సరైన నిర్దేశాలు ఇచ్చినందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై శ్రీలత అవార్డు గ్రహీతలకు అభినందన సభలో వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయ ప్రకాష్, ఇమ్మానుయేలు, పాల్ దివాకర్, నున్న శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాసరావు, వేదాంతం, విజయకుమార్, సంధ్యారాణి, అడప కేదరి, ఇతర కళాశాల సిబ్బంది అభినందించారు.

# అర్జీలు పరిష్కారంలో నాణ్యత పాటించాలి





**– పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలు 232 : జిల్లా కలెక్టర్**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) ద్వారా స్వీకరించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిజిఆర్ఎస్ అర్జీలను ప్రజలనుంచి స్వీకరించారు. ఈకార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు,డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, ఆర్డిఓ అచ్యుత అంబరీష్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ అర్జీలను స్వీకరించారు.ఈసందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ 232అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను వివిధ శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి వారి సిబ్బందితో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

– అందిన అర్జీలలో కొన్ని –ఏలూరు శ్రీరామనగర్‌కు చెందిన కె.పార్వతి ఆధార్ కార్డు లేదని వృద్ధాప్య పింఛన్ తనకు ఇవ్వడం లేదని ఆధార్ కార్డు అప్ డేట్ చేయించి వృధాప్య పించన్ ఇప్పించాల్సిందిగా కోరుతూ అర్జీ అందజేశారు. జంగారెడ్డిగూడెం పేరంపేటకు చెందిన బి.శంకరరావు దివ్యాంగుడైన తనకు మూడు చక్రాల సెకిల్‌ను ఇప్పించమని అర్జీ అందజేశారు. ఆగిరిపల్లి మండలం వడ్డి గుడిపాడుకు చెందిన ఎం.సుబ్బారావు తాను ఐటిఐ ఎలక్ట్రికల్ చదివి నిరుద్యోగిగా ఉన్నానని, కావున తనకు విద్యుత్ శాఖ కార్యాలయంలో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీఅందజేశారు. పెదపాడు మండలం జయపురంకు చెందిన ఎం.నక్షత్రరావు తమపొలం సర్వే నెంబరును తమఅంగీకారం లేకుండా మార్చుతున్నారని దానిని మార్చకుండాచూడాలని అర్జీ అందజేశారు. మండవల్లి మండలం లింగాల గ్రామంకు చెందిన పి.వెంకటేశ్వరమ్మ తన భర్త మరణించిన కారణంగా తాను ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నానని ప్రభుత్వం వితంతువులకు అందజేస్తున్న పింఛన్‌ను ఇప్పించ వలసిందిగా అర్జీ అందజేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మా ఊరు - మా రోడ్డు - అంతా మా ఇష్టం.. ?

కైకలూరు,మేజర్‌న్యూస్:స్థానిక మండల పరిధిలోని రాచపట్నం గ్రామపంచాయతీ పరిధిలో, కైకలూరు– కలిదిండి రహదారి సుమారు 22 అడుగులు మేర ఉండాల్సి ఉండగా, అది ఎక్కడా కనిపించిన దాఖల లేదు. ఇదిలా ఉంటే రహదారి అంచు వెంబడి గల పలువురు దుకాణదారులు, ఇది మా ఊరు మా రోడ్డు అంతా మా ఇష్టం అన్న చందాన దుకాణాలను ఏకంగా రోడ్డుపైన వ్యాపారాలు పెట్టిన పరిస్థితి. ఇక దుకాణానికి వచ్చిన వినియోగదారుల వాహనాలు రోడ్డు మధ్యలో నిలిపి దుకాణాలకు వెళ్లి రావడం గమనార్హం. పంచాయతీ, పోలీసు వారు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్న వైనం నెలకొంది. స్థానిక పంచాయతీ కార్యదర్శి మరియు సచివాలయ సిబ్బంది ప్రతినిత్యం గ్రామంలో సంచరిస్తున్నప్పటికీ వారికి ఈ పరిస్థితి కనపడదా అని మరియు స్థానిక పోలీసు వారు స్థానిక శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్‌కు బందోబస్తు ఇచ్చే క్రమంలో ఇటువైపు అనేకసార్లు ప్రయాణించినప్పటికీ వీటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ, స్థానిక గ్రామ ప్రజలు



రహదారి వెంబడి ప్రయాణించే వాహనదారులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ మరియు పోలీసు వారు సదరు విషయంపై తక్షణమే దృష్టిసారించి స్థానికప్రజలకు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వారు కోరుకుంటున్నారు.

# ఇంటి స్థలాలను తక్షణమే లబ్ధిదారులకు ఇవ్వాలి



**– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ),ఏలూరు 29వ డివిజన్,కుమ్మరి రేవు శాఖ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి,గొర్లి స్వాతి,వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఇంటి స్థలాలను పెంచి ఇవ్వాలని అర్జీల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన చాలీచాలని ఇంటి స్థలాలను పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పేదవాడికి సొంత ఇల్లు దక్కించడం కోసం గతంలో సిపిఐ అనేక పోరాటాలు చేసి ఏలూరు పరిసర ప్రాంతాలలో అనేక కాలనీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి ఇళ్ల స్థలాల అంశంపై ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం నుండి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలాలు పెంచి ఇవ్వవలసిన వారు, టిట్కో గృహాల లబ్ధిదారుల నుండి అర్జీలు నమోదు చేయించి ఫిబ్రవరి 10వ తేదీన జిల్లా కలెక్టర్‌కి అందజేసే కార్యక్రమం జరుగుతుందని ఆ కార్యక్రమంలో లబ్ధిదారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న పేదవాడికి సొంత ఇల్లు కట్టడం లేదని దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు తక్షణమే అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుని,ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు నగర అధ్యక్షులు కొంపల్లి కృష్ణమాచార్యులు ఏలూరు జిల్లా సమితి సభ్యులు మావూరి విజయ,బళ్ల కనక దుర్గారావు,తదితరులు పాల్గొన్నారు

## విశాఖ డైరీ యాజమాన్యం అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలి

– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



**ఏలూరు,మేజర్ న్యూస్:**విశాఖ పాల డైరీ యాజమాన్యం అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని,విశాఖ డైరీ యాజమాన్యం తగ్గించిన ఆవుపాల ధర రూ.4లు పునరుద్దరించాలని, పాలసేకరణ లక్ష్యం కుదిస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్న విశాఖ డైరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలలని,విశాఖ డైరీని కంపెనీ చట్టం నుండి సహకార చట్టంలోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అన్నే భవనంలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర లోని శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, అనకాపల్లి, జిల్లాల తోపాటు విశాఖపట్నం అర్బన్ జిల్లా, డాక్టర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలలో సుమారు 3.85 లక్షల రైతుల నుండి రోజుకు 9లక్షల లీటర్ల ఆవు, గేదె పాలను విశాఖ డైరీ రోజు సేకరిస్తునదని చెప్పారు. 2024 సెప్టెంబర్ నుండి ఆవుపాల సేకరణధర లీటర్‌కు రూ.35 నుండి రూ.31కితగ్గించారని,డైరీ యాజమాన్యం తగ్గించిన ఆవుపాల సేకరణ ధరను పెంచాలని కోరుతూ పాల రైతులు అనేక రూపాలలో తమ నిరసన వ్యక్తం చేశారన్నారు.శాసనసభా కమిటీ విచారణ,పాలధర తగ్గింపుకు వ్యతిరేకంగా రైతుల నిరసనలు కొనసాగుతుండగానే డైరీ యాజమాన్యం పాలసేకరణ తగ్గిస్తున్నామని ఉత్తర్వులు ఇచ్చి డైరీ పరిధిలోని పాల రైతులలో భయాందోళనలు సృష్టిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

## వైభవంగా ముగిసిన త్యాగరాజస్వామివారి మహోత్సవాలు



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్:**ముదినేపల్లిమండలం సింగరాయపాలెంలోని శ్రీ బావాజీ మఠం ప్రాంగణంలో శనివారం నుండి ప్రారంభమైన నవమి వార్షిక శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధన మహోత్సవాలు మహా అన్నసమారాధనతో వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా సింగరాయపాలెం–చేవూరుపాలెం నాయిబ్రాహ్మణ కళాకారుల సంఘం పలు భక్తి కార్యక్రమాలు , సంగీత విధ్వాంసులు,గాయకులు ,భజన , మంగళ వాయిద్యాలు ,భాగవతార హరికథా కాలక్షేపం అందరిని ఆలరింపజేశాయి. శ్రీ జ్యోతి సరస్వతిసాయిబాబా మ్యూజికల్ బ్యాండ్ పార్టీ (వీరవాసరం), శ్రీవిఘ్నేశ్వర నాదముని మ్యూజికల్ బ్యాండ్ పార్టీ (పెనుగొండ) ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మహాఅన్న సమారాధనలో పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్పందన ఫిర్యాదు పరిష్కారానికి చర్యలు



**ఇరగవరం,మేజర్ న్యూస్:** స్పందన కార్యక్రమంలో ఒక ఫిర్యాదు అందినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని రేలంగికి చెందిన బొడ్డు సుబ్రహ్మణ్యం ,5,6 వార్డుల ప్రజలు కలసి ఫిర్యాదు ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఫిర్యాదులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అన్ని శాఖాల అధికారులు పాల్గొన్నారు.

# 1 నుండి ప్రభుత్వ ఉద్యోగులు హెల్మెట్ ధరించాలి





**– హెల్మెట్ తప్పని సరి – లేకుంటే సాధారణ సెలవుగా పరిగణింపు**

**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేని ఎడల సాధారణ సెలవుగా పరిగణించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు అనుసరించి ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని ద్విచక్రవాహనం కలిగిన ఉద్యోగులు హెల్మెట్ ధరించి కార్యాలయాలకు హాజరై అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. వాహన చోదకుల నిర్లక్ష్యం,ఇతర కారణంగా ప్రమాదాలతో వారి కుటుంబాలకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇప్పటికే ఈవిషయంపై అన్నిస్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎపి బ్రాండ్‌ను దావోస్ వేదికగా చాటి చెప్పిన చంద్రబాబు

**– లోకేష్ యువ గళం పాదయాత్ర చారిత్రాత్మకం**

**పాలకొల్లు,మేజర్ న్యూస్:** దావోస్ వేదికగా ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాటి చెప్పారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మన రాష్ట్రానికి భారీ పెట్టుబడులే లక్ష్యంగా సాగిన చంద్రబాబు ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగిన దావోస్ పర్యటన పూర్తిగా విజయవంతమయ్యిందన్నారు. ఆ పలితంగానే ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు, అధిపతులు బడా కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు బలమైన అడుగులు పడ్డాయి అన్నారు. మన రాష్ట్రంలో ఉన్న అపారమైన వనరులను పారిశ్రామికవేత్తలకు వివరించి మౌలిక వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చి రాష్ట్రానికి రమ్మని ఆహ్వానించారు. నాడు జగన్ ప్రభుత్వంలో లూలు, జాకీ, అమర్ రాజా, కియో, విస్తరణ వంటి పరిశ్రమలు ఎన్నో రాష్ట్రం వదిలి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయని, పారిశ్రామికవేత్తలు సైతం రావాలంటే భయపడే వారని మంత్రి తెలిపారు. దీనిని బట్టి గత ప్రభుత్వంలో విధ్వంసం ఏవిధంగా జరిగిందో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ రాక్షస పాలన రాజ్యమేలుతున్న తరుణంలో



ప్రజలు భయంకపితులై ఆందోళనలో ఉన్న సమయంలో నారా లోకేష్ యువగళం పేరిట జరిపిన పాదయాత్ర ఎంతో సాహసోపేతం, చారిత్రాత్మకమని మంత్రి రామానాయుడు తెలిపారు. లోకేష్ జరిపిన యువ గళంతో రాష్ట్ర రాజకీయ చిత్రపటం మారడమే కాకుండా నేటి ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. యువ గళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా లోకేష్ కు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు వ్యక్తపరిచారు.

# జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం వర్మీ కంపోస్ట్ అమ్మకం

**– ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్**

**భీమవరం,మేజర్ న్యూస్:** స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ చదవాడ నాగరాణి వర్మి కంపోస్ట్ అమ్మకం స్టాల్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆర్గానిక్ వర్మీ కంపోస్ట్ వాడడం వలన ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ఈ కంపోస్టులో ఐదు రకాల సూక్ష్మ పోషకాలు ఉండడం కారణంగా పంటలు అధిక దిగుబడి వస్తుందన్నారు. వానపాములతో తయారైన ఈ ఎరువును పెరటి మొక్కలకు వినియోగించడం కారణంగా అధిక మొత్తంలో పువ్వులు, ఫల సాయం కూడా అందుకోవచ్చు అన్నారు. ఆర్గానిక్ ఎరువుల ద్వారా పండించిన కూరగాయలు, పండ్లతో ఎంతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. అలాగే ఎక్కువ మొత్తంలో అవసరమైన రైతులు పంచాయతీలోని వర్మీ కంపోస్ట్ ప్లాంట్స్ నుండి నేరుగా కొనుగోలు చేసి వినియోగించుకోవచ్చు అన్నారు. పంచాయతీల్లోని ఘన వ్యర్ధ నిర్వహణ కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్ట్ నాణ్యంగా తయారు చేయడం జరుగుతుందని,కిలో ఒక్కింటికి రూ.10 లు చొప్పున స్టాల్ నిర్వాహకులు అమ్మకం జరుపుతున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం రొటేషన్ పద్ధతిలో రెండేసి పంచాయతీలు చొప్పున అమ్మకాలు చేపట్టనున్నట్లు తెలిపారు.



ఈరోజు విస్సా కోడేరు,ఉణుదుర్రు పంచాయతీల ఎస్ డబ్ల్యూ సి ప్లాంట్స్ నుండి తయారుచేసిన వర్మి కంపోస్ట్‌ను స్టాల్ ద్వారా అమ్మకాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణ శ్రీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ టెక్నికల్ కోఆర్డినేటర్ ఎన్.ఎడ్వర్డ్, రిసోర్స్ పర్సన్స్ విశ్వనాథం, కె.రామలక్ష్మి, పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

# చిత్రలేఖనం సీనియర్స్ విభాగంలో లావు సౌజన్య మొదటి బహుమతి



**పెదపాడు,మేజర్ న్యూస్:** బాలోత్సవం చిత్రలేఖన విభాగంలో విజేత అప్పనవీడు 5 వ హేలాపురి బాలోత్సవం లో నిర్వహించిన వివిధ పోటీల్లో చిత్రలేఖనం సీనియర్స్ విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న లావు సౌజన్య మొదటి బహుమతి సాధించింది నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారబోయిన కోటేశ్వరావు గారు చేతుల మీదగా అందుకు అవడం జరిగింది. విద్యార్థిని సౌజన్యని డ్రాయింగ్ మాస్టారు రజినీకాంత్ నీ పాఠశాల ప్రధానోపాధ్యా రాలు తోట పుష్పవతి ,ఎంఈఓ నరసింహమూర్తి, డివి రమణ అభినందించారు.

# సెయింట్ థెరీసాలో ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన




**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక సెయింట్ థెరీసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ ప్రోగ్రాంలో కళాశాల ప్రిన్సిపాల డా.సిస్టర్ మెర్సీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్లో మంచిర్యాంకును ఫలితాలను సాధించిన తర్వాత ఆత్మస్థైర్యంతో కెరీర్ ను ఎంచుకునే అవకాశం లభిస్తుంది అన్నారు. జువాలజీ అధ్యాపకులు డా.మాధవీరాణి బైపిసి విద్యార్థులకు ఉన్నత విద్యా రంగంలో గల అవకాశాలను గురించి చర్చించారు. మేనేజ్మెంట్ అధ్యాపకులు హెప్సిబా సీఈసీ, ఎం ఇ సి విద్యార్థులకు చార్టెడ్ అకౌంటెన్సీ రంగంలో గల విద్య ఉద్యోగ అవకాశాల గురించి చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ పి విద్యార్థినులకు నూతన విద్యా విధానం గురించి వివరించారు. అధ్యాపకురాలు డాక్టర్ మేజర్ పీఎం సెలిన్ రోజ్ క్రీడలు,ఆటల ద్వారా విద్యార్థులకు విద్యా రంగంలో లభించే ఉన్నత అవకాశాలను గురించి చర్చించారు.రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జ్యోతిర్మయి విద్యార్థినుల కళాశాల గురించి పరిచయం చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ సిస్టర్ మెర్సీ ఆధ్వర్యంలో జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఇందిర, రసాయన శాస్త్ర అధ్యాపకులు డా. రమ నిర్వహించారు.

# రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువగళం పట్ల థామస్ హర్షం



(ఫైల్ ఫోటో)

**చింతలపూడి, మేజర్ న్యూస్:** నాటి వైసిపి ప్రభుత్వ అరాచకాల పై దండయాత్ర చేస్తూ నేటి తెలుగు దేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు 2సం.పూర్తయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేసిన డా.మారుమూడి థామస్. రాష్ట్రంలో ఐదు కోట్ల మంది ఆశలు ఆశయాలు ప్రతిబింబిస్తూ తెలుగు యువనేత ప్రస్తుత ఐటి మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ 2023 జనవరి 27న పాదయాత్రకు శ్రీకారం చుట్టడం జరిగింది. రాష్ట్రంలోని 97 అసెంబ్లీ నియోజకవర్గాలు 2.097 గ్రామాల మీదుగా 256 రోజులు 3,132 కిలోమీటర్లు నడవడంతో ప్రజల కష్టాలు,కన్నీళ్లను తనకష్టాలుగా భావించి చింతలపూడి నియోజకవర్గంలో కూడా పాదయాత్ర కొనసాగించారు. ఆపాదయాత్రలో డాక్టర్ మారుమూడి థామస్ సంఘీభావంతో సహ పాదయాత్ర చేస్తూ రాష్ట్రంలోని రాజారెడ్డి రాజ్యాంగాన్ని అంతమొందించి అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని లోకేష్‌కు బహూకరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 6.33లక్షల పెట్టుబడులు నాలుగు లక్షలఉద్యోగాలు కల్పించేందుకు వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్న ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుంది అనటంలో అతిశయోక్తి లేదని థామస్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆలపాటి ఇంటి పై దాడి





పెదవేగి,మేజర్ న్యూస్: కాంగ్రెస్ పార్టీ దెందులూరు నియోజకవర్గం కన్వీనర్, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన సీనియర్ నాయకుడు ఆలపాటి నరసింహమూర్తి ఇంటిపై సోమవారం ఉదయం దాడి జరిగింది. కొంతమంది వ్యక్తులు ఇంటి గేటు దూకి, కార్లను ధ్వంసం చేశారు. ఎన్నికల్లో ఉపయోగించే ప్రచార వాహనంతోపాటు సుమో వాహనాన్ని ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ బందోబస్తు ఏర్పాటు చేసి, పరిస్థితి చేయిదాటకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆలపాటి నరసింహమూర్తి మాట్లాడుతూ అగ్రకులానికి చెందిన కొంతమంది వ్యక్తులు గ్రామంలోని చింతలచెరువును ఆక్రమించుకుని, పూడ్చి, సాగు చేసు న్నారు. దాంతోపాటు సమీపంలో ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటికనుకూడా ఆక్రమించుకున్నారు. దీనిపై ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు స్మశాన వాటిక స్థలం ఆక్రమణ విషయంలో ఇరువర్గాలు కొద్దిరోజులుగా ఘర్షణ పడుతున్నారు. ఈ నేపధ్యం లో బుధవారం ఉదయం చెరువు ఆక్రమించుకున్న అగ్రకులాలకు చెందిన కొంతమంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారిపై దాడికి వెళ్ళారని, దాడి విషయం ముందే తెలుసుకున్న ఎస్సీ సామాజికవర్గానికి చెందిన పారిపోగా, ఆగ్రహంతో ఉన్న అగ్రకులానికి చెందిన వైసీపీ వర్గీయులు కత్తులు, రాడ్లుతో తన ఇంటికి వచ్చి, గేట్లు దూకి, లోపల ఉన్న రెండు కార్లను ధ్వంసం చేశారని ఆయన వివరించారు. వైసీపీకి చెందిన మాజీఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పోద్భలంతోనే గ్రామంలోని వైసీపీ నాయకులు తన ఇంటిపైకి దాడికి తెగబడ్డారని ఆయన ఆరోపించారు. దీనిపై పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశామని నరసింహమూర్తి తెలిపారు.

# చంద్రబాబు అంటే అభివృద్ధికి అంబాసిడర్

**ఆయన స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కృషి**



**నూజివీడు,మేజర్ న్యూస్:** చంద్ర బాబు అంటే అభివృద్ధికి అంబాసిడర్ అని.. ఆయన స్ఫూర్తితో ప్రజా సంక్షే మమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నూజివీడు సత్యనారా యణ థియేటర్ ఎదురుగా వికాస్ కాలేజ్ పక్కన నూతనంగా నిర్మించిన సి.సి రోడ్డును రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి చివరి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రోడ్ల అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకు మెరుగైన రహదారులు అందించాలనే లక్ష్యంతో రూ.861 కోట్ల నిధులతో రోడ్ల మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు.

– డ్రైనేజీలను పరిశీలించిన మంత్రి –పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చెత్త పేరుకుపోయిన మురుగు డ్రైనేజీ పరిశీలించారు. వాటిని తక్షణమే పూడిక తీయించి మురుగు నీటిపారుదల సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ



**నరసాపురం,మేజర్ న్యూస్:** స్థానిక రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పేద మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. స్థానిక తెలగ కళ్యాణమండప ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి రాయల్ నేషనల్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో తరచూ సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అధ్యక్షులు జక్కం బాబ్జి రాయల్ మహిళా క్లబ్ అధ్యక్షురాలు వలవల సావిత్రి రాయల్ నేషనల్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావుల దన సహాయంతో ఈ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి రఘురామారావు, ఎర్రం శెట్టి ప నికర్, పోలిశెట్టి గణేశ్వరరావు రాయల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# దైనందిన జీవితంలో ముఖ్యమైన భాగంగా మారిన రోబోలు,కృత్రిమ మేధస్సు







**ఏలూరు,మేజర్ న్యూస్ :** సర్.సి ఆర్. రెడ్డి పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'బేసిక్ ఎలక్ట్రానిక్స్,సూపర్ కండక్టివిటీ ఉపయోగాలు' అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం నందు ఫిజిక్స్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ వై.సుష్మ ప్రియ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాలైన రోబోలు,కృత్రిమ మేధస్సు మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయని పేర్కొన్నారు.

సూపర్ కండక్టివిటీకి ఉన్న ప్రత్యేక లక్షణాలు వల్ల ప్రస్తుతం ఆసుపత్రులలో ఉపయోగిస్తున్న మ్యాగ్నెటిక్ రెసోనెన్సు ఇమేజింగ్ స్కానింగ్ వల్ల రోగ నిర్ధారణలో ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, అలాగే రైళ్ళు 'మ్యాగ్నెటిక్ లెవిటేషన్' సాంకేతికతతో అత్యంత వేగంగా వెళ్లటానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు.

అంతేకాకుండా సూపర్ కండక్టివిటీ వల్ల భవిష్యత్తులో దాదాపు ధ్వని వేగంతో సమానంగా ప్రయాణించే "హైపర్ లూప్" సాంకేతికత అభివృద్ధి చెందిందని,అందు వల్ల రైల్వే ప్రయాణాలు అత్యంత వేగంగా జరగటాని దోహదపడతాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎస్.విష్ణు మోహన్,పీ.జీ కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఏ.రామరాజు, పీ.జీ సంచాలకులు డాక్టర్ వి.ఆర్.ఎస్.బాబు యలమర్తి,ఎమ్మెస్సీ ఫిజిక్స్ విభాగపు అధిపతి యం.రాజు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించండి : కమిషనర్ అంజయ్య



**నరసాపురం, మేజర్ న్యూస్ :** పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూల నకు వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ యం అంజయ్య కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం పెరిగిపోయి అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తున్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు చేపట్టవల సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడవల సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ఆయన అన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ మరుగుదొడ్ల వినియోగంలో అధిక వసూళ్లు ఆపాలి : సిపియం



నర్సాపురం, మేజర్ న్యూస్ : ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉపయోగించుకున్న ప్రయాణికుల నుండి పది రూపాయలు వసూలు చేయడం ఆపాలని డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎన్ సురేంద్ర వర్మ కు సిపిఎం నాయకులు వినతపత్రం చేసారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం.త్రిమూర్తులు మాట్లాడుతూ బస్టాండు కు ప్రతిరోజు వందలాదిమంది ప్రయాణికులు వేర్వేరు ప్రాంతాలకు ప్రయాణం చేయడం వేరు వేరు ప్రాంతాల నుండి రావడం జరుగుతుం దని,కాల కృతులు తీర్చుకొనుటకు మరుగుదొడ్లకు వెళ్లిన ప్రయాణికులు నుండి నిబంధనలకు వ్యతిరేకంగా అధిక మొత్తంలో పది రూపాయలు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 10 రూపాయలు వసూలు చేయటం అన్యాయమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బస్టాండ్ పరిసరాల ప్రాంతంలో బహిరంగం మూత్ర విసర్జన చేయకుండా గోడలపై వాల్ రైటింగ్ హెచ్చరిక బోర్డులు రాయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేతినేడి వెంకటేశ్వరరావు, బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, కోడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



భీమడోలు,మేజర్ న్యూస్: వాహనదారులు సురక్షిత ప్రయాణం కోసం రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఏలూరు కు చెం దిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు పలువురు కోరారు. భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పాఠశాలకు చెందిన డ్రైవర్లు మరియు సిబ్బందితోపాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శేఖర రావు, హజీర, మధు, నరేంద్ర, ప్రజ్ఞ, కళ్యాణి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, 18 సంవత్సరాలు నిండిన వారు వాహనాలు నడిపేం దుకు లైసెన్సులను తీసుకోవాలన్నారు. అంతకు లోపు వయసు గల వారు వాహనాలను నడపరాదన్నారు సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. రాష్ డ్రైవింగ్ తగదన్నారు. 60 సంవత్సరాలు నిండిన వాహన డ్రైవర్లు స్కూలు బస్సులను నడప రాదన్నారు. మద్యం సేవించి వాహనాలను డ్రైవింగ్ చేయరాదన్నారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించాలని, భద్రత కోసం సీటు బెల్టు వినియోగించాలని సూచించారు. కార్య క్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

# క్రీస్తు సువార్త సేవలో అవిరళ కృషిచేసిన ఫాదర్ ఆల్ఫోన్స్






బిషప్ పొలిమెర జయరావు

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** సొసైటీ ఆఫ్ సెయింట్ పాల్ సంస్థ ఆంధ్రప్రదేశ్లో ఆవిర్భవించి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భం , గురుత్వ సేవలో గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటున్న ఫాదర్ ఆల్ఫోన్స్ సేవలు అభినందనీయమని బిషప్ పొలిమేర జయరావు అన్నారు. స్థానిక ఎన్ ఆర్ పేట కేబీ సింగ్ వీధిలోని శుభోదయం లో శనివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. సెయింట్ థెరిస్సా చర్చి ప్యారిష్ ప్రీస్ట్ జోసఫ్ పారయిల్ సమావేశానికి స్వాగతం పలికారు. సెయింట్ పాల్ సొసైటీ సుపీరియర్ ఫాదర్ జోబీ మ్యాథ్యూ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిషప్ జయరావు మాట్లాడుతూ, ఫాదర్ ఆల్ఫోన్స్ శుభోదయం నిలయం కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్లో ప్రత్యేకించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటింటికి బైబిల్ అనే కార్యక్రమాన్ని చేపట్టి క్రీస్తు సువార్తను విజయవంతంగా ప్రకటించారనిఅన్నారు. అంతేకాకుండా ఆయన పలు భాషల్లోని వ్యాసాలను తెలుగులో, ఇంగ్లీషులో తర్జుమా చేసి క్రైస్తవులకు, ఆంగ్ల పత్రికలకు, సంస్థలకు అందించారన్నారు. టీనేజర్ వంటి ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ ఆంగ్ల పత్రికలకు ఎడిటర్‌గా ఉండి నిరంతరం చేశారన్నారు.ఆల్ఫోన్స్ ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమం చేపడుతూ కొత్తగా ఇంటింటికి కొత్త నిబంధనను కొత్త ప్రింట్‌తో అందించబోతున్నారని బిషప్ పేర్కొన్నారు. నూతన నిబంధనను ఆయన ఆవిష్కరించారు. ఫాదర్ ఆల్ఫోన్స్ వలె ఇప్పుడున్న ఫాదర్‌లు, సిస్టర్‌లు కమ్యూనికేషన్స్, మీడియా రంగాన్ని ఎంపిక చేసుకొని ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఆల్ఫోన్స్ 78 ఏళ్ల వయసులో కూడా17 ఏళ్ల యువకుడిలా పనిచేస్తూ,ప్రయాణాలు చేస్తూ క్రీస్తు సేవలో పునీతులవుతున్నా రని అన్నారు.

వికార్ జనరల్ ఫాదర్ పి.బాల మాట్లాడుతూ ఆల్ఫోన్స్ ఫాదర్ కమ్యూనికేషన్స్ రంగంలో బైబిల్ ను ప్రజలకు దరి చేర్చారన్నారు. ఫాదర్ ఆల్ఫోన్స్ మాట్లాడుతూ1986లో ఏలూరు వచ్చిన తాను దివంగత బిషప్ జాన్ ములగాడ ప్రోత్సాహంతో, ఆర్.సి.యం డయాసిస్ సహకారంతో శుభోద నిలయం కమ్యూనికేషన్ సెంటర్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టామని,1994 జనవరి 22న జాన్ ములగాడచే నూతన భవనం ప్రారంభించుకున్నామని అన్నారు. తనకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి, ఫాదర్లకు, సిస్టర్లకు, బిషప్ పొలిమేర జయరావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఫాదర్ జార్జ్ కార్యక్రమం పూర్తి సంగ్రహ పాటాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో బిషప్ సీజర్ బెనవెంటో( ఇటలీ), ఫాదర్ జి.మోజెస్. ఛాన్సర్ ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ డి. నతానియల్, అబ్రహం మాస్టర్, సిస్టర్ పూదోట మరియట్ట, సిస్టర్ మెర్సీ తదితర అనేకమంది ఫాదర్ లు, సిస్టర్ లు, సంఘస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ వ్యవసాయ సహాయకుడిగా షైలభాను



భీమడోలు,మేజర్ న్యూస్: జిల్లా స్థాయిలో గ్రామ సచివాలయ ఉత్తమ వ్యవసాయ సహాయకులుగా భీమడోలు మండలం సూరప్ప గూడెం. రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు డి.(కె).షైలభాను ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా షైలభాను ప్రోత్సాహకాన్ని స్వీకరించారు. ఈ మేరకు సోమవారం సూరప్ప గూడెం రైతు సేవ కేంద్రం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రైతులు అవార్డు గ్రహీతను అభినందించారు. 2019 వ సంవత్సరంలో సూరప్పగూడెం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులుగా బాధ్యత స్వీకరించిన భాను తన కాలంలో రైతుల అభ్యున్నతికి, ప్రభుత్వం రూపొందించిన. పలు కార్యక్రమాలను తెలియజేస్తూ, వాటిని అమలు చేయటంలో సహకరించారని రైతులు అన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తమ జిల్లా పర్యటనలో భాగంగా రైతు సేవ కేంద్రాలను సందర్శించినప్పుడు తప్పనిసరిగా వచ్చేది సూరప్ప గూడెం కేంద్రానికి మాత్రమేనని, ఈ సందర్భంగా వారికి రైతు సేవా కేంద్రం ద్వారా అందుతున్న సేవలు, రైతుల అభిప్రాయాలు. నేరుగా వారికి తెలియజ ేసేందుకు, ప్రత్యక్ష రూపంలో చూపేందుకు భాను విశేష కృషి చేశారన్నారు.

# ఏలూరు జిల్లాలో రూ. 97.90 కోట్లతో 174 రోడ్ల అభివృద్ధి పనులు

**– రోడ్ల నిర్మాణ ప్రగతిపై ఫొటో ఎగ్జిబిషన్ తిలకించిన మంత్రి జనార్ధనరెడ్డి**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లాలో రూ.97.90 కోట్లతో 682 కి.మీ మేర రహదారులకు గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టగా అందుకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు,మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి.జనార్ధనరెడ్డికి వివరించారు. సోమవారం స్థానిక రెవిన్యూ గెస్ట్ హౌస్‌లో ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్ల నిర్మాణ ప్రగతి పనులపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకరరావు లతో కలిసి రాష్ట్ర మంత్రి బి.సి. జనార్ధనరెడ్డి తిలకించారు. జిల్లాలో ఇప్పటి వరకు 345కి.మీ మేర రహదారి పనులు ఆర్అండ్‌బి శాఖ అధికారులు మరమ్మతులు నిర్వహించారని కలెక్టర్ వివరించారు. గుంతలు రహిత జిల్లాగా ఉంచేందుకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించడం అభినందనీయం అన్నారు. ఫిబ్రవరి నాటికి సంబంధిత పనులు పూర్తయ్యేలాగా ఆర్అండ్‌బి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు,డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్ అండ్ బిఎస్ఇ జి.జాన్ మోషే,ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, తహశీల్దారు జి.వి.శేషగిరి తదితరులు ఉన్నారు.

## గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి : ఆర్డీవో దాసి రాజు



నర్సాపురం, మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్డీవో దాసి రాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 26 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ లోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో 50 కంపెనీలు ఏం ఏ షరీఫ్



**నరసాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో 50 కంపెనీలు, సుమారు 5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయని ప్రభుత్వ మైనార్టీ సెల్ సలహాదారు యం ఏ షరీఫ్ తెలిపారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా తీసుకువచ్చిన పెట్టుబడుల వల్ల రాష్ట్రంలో 40 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖ నారా లోకేష్ దావోస్ పర్యటన విజయవంతమైందని అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు షరీఫ్ తెలిపారు. ఈ సమావేశంలో జక్కం శ్రీమన్నారాయణ, పొన్నాల నాగబాబు, అధికారి అనంతరామారావు, కొల్లు పెద్దిరాజు, సంకు భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి అధికారంలోనికి రావడానికి లోకేష్ యువగళం దోహదం

**– టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు**



**భీమడోలు,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రావడానికి నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర ఫలితాలు సహకరించాయని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో నారా లోకేష్ ఆధ్వర్యంలో చేపట్టిన యువగళం పాదయాత్ర రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంతో పాటు, చంద్రబాబు ఆధ్వర్యంలో చేపట్టిన దావోస్ పర్యటన విజయవంతమైనందుకు అభినందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కోశారు. మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ, యువగళం పాదయాత్ర అప్పట్లో వివిధ రూపాల్లో నైరాశ్యంతో ఉన్న ప్రజలకు ధైర్యం కల్పించిందని, ఫలితంగా కూటమి ప్రభుత్వానికి వారందరూ మద్దతుగా నిలిచారని తెలిపారు. రాజకీయ యవనికపై చెరగని ముద్ర వేసిందని అభివర్ణించారు. ఇక చంద్రబాబు దావోస్ పర్యటన కారణంగా. దేశంలో పెట్టుబడులను పెట్టేందుకు పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారని, దీనిలో భాగంగానే రాష్ట్రానికి వరల్డ్ ఎకానమిక్ ఫారం ఆధ్వర్యంలో పెట్టుబడుల వెల్లువ రానుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు కరణం పెద్దిరాజు, చింతల వాసు, భీమడోలు ఎ.ఎం.సి. మాజీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్య,మాజీ ఎం.పి.పి.ఎం.రామ తులసమ్మ యుగంధర్,ఆదిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

# సేవకు మరో పేరు రాజ్ ట్రస్ట్

**– 150 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం,మేజర్ న్యూస్:** పేద మహిళలు ఆర్థికంగా సామాజిక ంగా ఎదగాలనే సంకల్పంతో సహకారాలను అందించడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం గునుపూడిలో రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. ఆపదలో ఉన్నవారిని తోటివారికి సహాయ సహకారాలను అందించడం సామాజిక బాధ్యత అని అన్నారు. రాజ్ ట్రస్ట్ అంటేనే సమాజ సేవ అని, సేవకు మరో పేరు అని అన్నారు.

మహిళలకు ఎంతో కాలంగా ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తూనే ఉన్నారని, వారు అందిస్తున్న సహకారం అద్వితీయమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్, అధ్యక్షులు ఆనంద్, హిందూ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, నల్లం చిట్టిబాబు, రెడ్డి సత్తిబాబు, కొప్పినిడి శ్రీనివాస్, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.